# ఆదాయం సమకూర్చుకోరా?

- షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించి వదిలేసిన వైనం
- ఇల్లెందులో సిద్ధంగా 16 గదులు, అసంపూర్తిగా ఇంకో 16..
- ఆదాయం వస్తుందని తెలిసినా పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యం


లలిత కళామందిర్ రోడ్డులో షాపులు కేటాయించని కాంప్లెక్స్

**ఇల్లెందు:** ఇల్లెందు పట్టణం నడిబొడ్డున నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సును ప్రారంభించినా షాపుల కేటాయింపులో జాప్యం జరుగుతోంది. త్వరగా షాపులు కేటాయిస్తే అటు వ్యాపారులకు మేలు జరగడమే కాక మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతుంది. ఇందుకోసం మున్సిపల్ పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేయాల్సి ఉండగా జాప్యం జరుగుతుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. పట్టణంలోని లలిత కళామందిర్ రోడ్డులో రెండేళ్ల కిందట సుమారు రూ.1.50 కోట్లతో 32 గదుల నిర్మాణం చేపట్టారు. కింది అంతస్తులో 16, పైఅంతస్తులో మరో 16 గదులు నిర్మించాలనే ప్రణాళిక ఉన్నా కింద అంతస్తు నిర్మాణం పూర్తయింది. ఈ గదులను కేటాయించినా ఆదాయం వస్తుందని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

### గతనెల 28న ప్రారంభం

మంత్రి పువ్వాడ అజయ్ పట్టణంలో పర్యటనకు వచ్చినప్పుడు గత నెల 28న షాపింగ్ కాంప్లెక్స్‌ను కూడా ప్రారంభించారు. అయితే, మున్సిపల్ పాలకవర్గ సమావేశంలో చర్చించి రిజర్వేషన్ ప్రకారం గదులను కేటాయించేలా తీర్మానం చేయాలి. అనంతరం వేలంలో షాపులు కేటాయిస్తే అద్దె సమకూరుతుంది. కానీ ప్రస్తుతం పాలకవర్గం రెండుగా చీలిపోయిన నేపథ్యాన ఏకాభిప్రాయం కష్టమేనని తెలుస్తోంది. దీంతో రోడ్ల వెంట చిరువ్యాపారులు చేస్తున్న వారు కేటాయింపుల కోసం ఎదురుచూస్తున్నారు.

### పాత గదులదీ అదే పరిస్థితి

పాత బస్టాండ్‌లో పోస్టాఫీస్‌కు ఇరువైపులా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఒకవైపు ఆరు గదుల నిర్మాణం పూర్తికాగా, పూల వ్యాపారులకు కేటాయించారు. మరోపక్క గదులు అసంపూర్తిగా వదిలేయడంతో అద్దెకు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఇక మెయిన్ రోడ్డులో హైస్కూల్ ఎదురుగా నిర్మించిన 32 గదులు సగం పూర్తి కాగా ఇటీవల ప్రారంభించారు. ఇందులో కొన్నింటిని అద్దెకు ఇచ్చినా మిగతావి ఖాళీగా ఉన్నాయి. అలాగే, మెయిన్‌రోడ్ హైస్కూల్ ప్రహరీ వెంట ఇరవై గదులను నిర్మించాల్సి ఉన్నా కోర్టు స్టేతో పనులు నిలిచిపోయాయి. ఇలా రకరకాల కారణాలతో కొన్ని అసంపూర్తిగా మిగిలిపోగా, ఇంకొన్ని షాపుల నిర్మాణం పూర్తయినా కేటాయంపులు జరగడం లేదు. దీంతో రహదారులపై చిరువ్యాపారాలు కొనసాగుతుండగా, మున్సిపాలిటీ ఆదాయం కోల్పోతోంది.

### సకాలంలో కేటాయించాలి



వీధి వ్యాపారుల కోసం నిర్మించిన కాంప్లెక్సుల్లో షాపులను సకాలంలో కేటాయించాలి. తద్వారా వ్యాపారులకు ఉపయోగంగా ఉంటుంది. రహదారులపై వ్యాపారాలు చేసే వారికి మేలు జరుగుతుంది. అలాగే, మున్సిపాలిటీకి ఆదాయం కూడా లభిస్తుంది.

–వి.హరీశ్, ఇల్లెందు

### అర్హులకే ఇవ్వాలి..



రోడ్ల వెంట వ్యాపారులు చేసే అర్హులకే కాంప్లెక్స్‌ల్లో గదులు కేటాయించాలి. తద్వారా ఎండ, వాన నుంచి వారికి విముక్తి లభించడంతో పాటు కుటుంబాలు బాగుపడతాయి. ఈ విషయమై మున్సిపల్ అధికారులు, పాలకవర్గం ఇకనైనా స్పందించి, చర్యలు వేగంగా చేపట్టాలి.

–బి.రాంసింగ్, ఎన్డీ పట్టణ కార్యదర్శి, ఇల్లెందు

### తీర్మానం చేయాల్సి ఉంది..



లలిత్ కళామందిర్ రోడ్డు కాంప్లెక్స్‌లోని 16 గదులు ప్రస్తుతం సిద్ధంగా ఉన్నాయి. ప్రారంభోత్సవం కూడా జరిగింది. అయితే, వాటిని అద్దెకు ఇచ్చేందుకు పాలకవర్గ సమావేశంలో చర్చించి తీర్మానించాల్సి ఉంది. త్వరలోనే దీనిపై చర్చించి గదులు కేటాయిస్తాం.

–కుమారస్వామి, కమిషనర్, ఇల్లెందు

## తుదిశ్వాస వరకు ప్రజాసేవలోనే..


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వనమా

**పాల్వంచ:** తన తుదిశ్వాస వరక ప్రజాసేవలోనే ఉంటానని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మున్సిపాలిటీలో సుమారు రూ.11 కోట్ల వ్యయంతో ఇందిరానగర్‌కాలనీ, హమాలీకాలనీ, కరకవాగు, సీతారాంపట్నం తదితర ఏరియాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వనమా మాట్లాడారు.. దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలిచేలా కేసీఆర్ అభివృద్ధి చేశారని, ఎవరెన్ని కుట్రలు పన్నినా వచ్చే ఎన్నికల్లో విజయం తనదేనని ధీమా వ్యక్తం చేశారు. 40 ఏళ్లుగా తాను నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని, ప్రజలకు సేవ చేస్తున్నానని, రూ.3 వేల కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేశానని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఎ.స్వామి, మురళి, రాజేశ్, నాయకులు కొత్వాల శ్రీనివాసరావు, బరపటి వాసుదేవరావు, సరస్వతి, మహిపతి రామలింగం, వనమా రాఘవేంద్రరావు, మంతపురి రాజుగౌడ్, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, మల్లెల శ్రీరామ్మూర్తి, విశ్వనాథం, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కాల్వ ప్రకాశ్‌రావు, రమణమూర్తి, దాసరి నాగేశ్వరరావు, విజయ్, సోమయ్య, రాజశేఖర్, మదార్, నాగేశ్వరరావు, బాయమ్మ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

### లాభాల్లో వాటా ఇవ్వాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

**టేకులపల్లి:** కోల్ ట్రాన్స్‌పోర్టు కార్మికులకు వేతన ఒప్పందం, చట్టబద్ధ హక్కులు, సింగరేణి లాభాల్లో వాటా చెల్లించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ రాసుద్దీన్ డిమాండ్ చేశారు. సోమవారం కేటీసీలో జరిగిన యూనియన్ సమావేశంలో తొలుత డిమాండ్లకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. సమావేశంలో ఎల్.మారుతీరావు, రాంబాబు, రాజు, సురేశ్, పవన్, రవి, సాయి, రాజేశ్, వెంకటేశ్వర్లు, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### బోడ శ్రీనివాస్ విగ్రహ ఆవిష్కరణ

**టేకులపల్లి:** టేకులపల్లి సర్పంచ్ బోడ సరిత భర్త, బీఆర్‌ఎస్ నేత బోడ శ్రీనివాస్ కరోనాతో గతంలో మృతి చెందగా, ఆయన విగ్రహాన్ని సోమవారం వారి వ్యవసాయ భూమిలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, బోడ బాలు, భూక్య బాలకృష్ణ, బోడ మంగీలాల్, పూనెం సురేందర్, ఉండేటి ప్రసాద్, బాణోతు సరోజ, భూక్య సర్దార్, రావూరి సతీశ్ పాల్గొన్నారు.

## మూడోసారి సీఎంగా చూడడమే లక్ష్యం


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

**జూలూరుపాడు:** ప్రాంతీయ పార్టీగా మొదలై జాతీయ పార్టీగా విస్తరించిన బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావును మూడోసారి కూడా సీఎంగా చూడడమే లక్ష్యమని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ తెలిపారు. జూలూరుపాడులోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన తొమ్మిది మందికి రూ.1.83 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసి మాట్లాడారు. టికెట్ రాలేదనే బాధ లేదని, సీఎం కేసీఆర్ నిర్ణయానికి కట్టుబడి పార్టీ అభివృద్ధి, విజయానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్యా సోనీ, నాయకులు లకావత్ గిరిబాబు, పొన్నెకంటి సతీశ్‌కుమార్, నున్నా రంగారావు, పెండ్యాల రాజశేఖర్, పసుపులేటి మోహన్‌రావు, ఎదళ్లపల్లి వీరభద్రం, నర్సింహారావు, రోకటి సురేశ్, దుద్దుకూరి కృష్ణప్రసాద్, చాపలమడుగు రామ్మూర్తి, మోదుగు రామకృష్ణ, పణితి వెంకటేశ్వర్లు, రాంశెట్టి నాగేశ్వరరావు, లకావత్ హేమ్లా, పాలెపు వెంకయ్య, భూక్యా దేవీలాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ సభకు తరలిరండి..


మాట్లాడుతున్న దాట్ల నాగేశ్వరరావు

**ఇల్లెందురూరల్:** ఇల్లెందు కేంద్రంగా ఈ నెల 24న నిర్వహిస్తున్న ఆదివాసీ డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ దాట్ల నాగేశ్వరరావు, కన్వీనర్ ఈసం సుధాకర్ పిలుపునిచ్చారు. సోమవారం ఇల్లెందులో ఏర్పాటైన జేఏసీ సమావేశంలో వారు మాట్లాడారు.. 5వ షెడ్యూల్, ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ హక్కులను రాజకీయ పార్టీలు అమలుచేసే విధంగా తమ రాజకీయ మేనిఫెస్టోలో ఆదివాసీ డిక్లరేషన్ డిమాండ్లను చేర్చాలని స్పష్టం చేశారు. ఆదివాసీ చట్టాలు, సంస్కృతి, సంప్రదాయాల రక్షణ కోసం నిర్వహిస్తున్న ఉద్యమంలో భాగంగా డిక్లరేషన్‌ను రాజకీయ పక్షాల ముందుంచుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కల్తీ వీరస్వామి, గొగ్గెల రామస్వామి, వీసం వెంకటేశ్వర్లు, తాటి మధు, బొల్లి సారయ్య, మోకాళ్ల సుధీర్, కొరస సురేశ్ పాల్గొన్నారు.

## అధికారులు నిర్లక్ష్యం వీడాలి


కాలనీని పరిశీలిస్తున్న ప్రజాపంథా నాయకులు

**టేకులపల్లి:** మండలంలోని అనేక గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, అధికారులు నిర్లక్ష్యం వీడి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి ధర్మపురి వీరబ్రహ్మాచారి, ఐఎఫ్‌టీయూ జిల్లా నేత జర్పుల సుందర్ కోరారు. సోమవారం మండల కమిటీ ఆధ్వర్యంలో టేకులపల్లిలోని పలు గ్రామాల్లో పర్యటించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలను సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పూర్తి కాకుండానే అయినట్లుగా పంచాయతీ, మండల అధికారులు ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బానోత్ లింగ, నారాయణ, నవీన్, కాశీరాం తదితరులు పాల్గొన్నారు.

## కత్తిమీద సాములా అటవీశాఖ ఉద్యోగం

అటవీశాఖ అమరవీరుల దినోత్సవంలో ఎఫ్‌డీఓ కర్నావత్ వెంకన్న


ఇల్లెందు: అమరుల స్తూపం వద్ద మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ కర్నావత్ వెంకన్న


పాల్వంచరూరల్: అమరులకు నివాళులు అర్పిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

**ఇల్లెందురూరల్:** చేతిలో ఆయుధం లేకుండా అడవిలో వన్యమృగాలు, స్మగర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ అడవులను కాపాడుతూ ముందుకు సాగడం అటవీశాఖ ఉద్యోగులకు కత్తిమీద సాములా మారిందని ఎఫ్‌డీఓ కర్నావత్ వెంకన్న అన్నారు. ఇల్లెందు డివిజన్ స్థాయిలో అటవీశాఖ అమరవీరుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అమరవీరుల స్మారక స్తూపం వద్ద అటవీ ఉద్యోగ అమరవీరులను స్మరిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిన్న మొన్నటి వరకు పోడు భూముల ఆక్రమణలను, కలప స్మగ్లింగ్‌ను నిలువరిస్తూ పలువురు అటవీశాఖ ఉద్యోగులు భౌతికదాడులకు, హత్యకు గురయ్యారని గుర్తుచేశారు. విధి నిర్వహణలో అమరులైన ఉద్యోగులు చూపిన స్ఫూర్తితో అడవుల సంరక్షణ, పునరుద్ధరణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ నాగేశ్వరరావు, డీఆర్‌ఓలు, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పాల్వంచ మండలంలో..

**పాల్వంచరూరల్:** అటవీశాఖ అమరవీరుల దినోత్సవం సందర్భంగా వైల్డ్‌లైఫ్, పాల్వంచ అటవీశాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శన నిర్వహించి అమరవీరులకు నివాళులర్పించారు. వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ కార్యాలయంలో గతేడాది మృతిచెందిన రేంజర్ శ్రీనివాసరావు చిత్రపటానికి ఎఫ్‌డీఓ కట్టా దామోదర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అటవీశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని, తొందరపాటుగా వ్యవహరించొద్దని, తమ వెనుక కుటుంబ బాధ్యత కూడా ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో రేంజర్లు శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, జశ్వంత్, వైల్డ్‌లైఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## కోరం లేక సమావేశం వాయిదా..

అధికారులు, ప్రజాప్రతినిధుల గైర్హాజరుపై జెడ్పీ చైర్మన్ అసంతృప్తి


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

**టేకులపల్లి:** టేకులపల్లి మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ భూక్య రాధ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. సమావేశ మందిరంలో 36 మంది సర్పంచ్‌లకు ఇద్దరు, 14 మంది ఎంపీటీసీ సభ్యులకు నలుగురు మాత్రమే హాజరు కావడం, కొందరు అధికారులు కూడా హాజరు కాకపోవడంతో జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు ప్రజా ప్రతినిధులు ముందస్తుగానే వచ్చి సంతకం చేసి వెళ్లిపోవడం గమనార్హం. ముఖ్యమైన సమావేశాలకు హాజరు కాకపోతే ప్రజలకు ఏం సమాధానం చెబుతారని, ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరయ్యేలా మండల అధికారులు చర్యలు తీసుకోవాలని కనకయ్య సూచించారు. కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేయాలని అధికారులను ఆదేశించడంతో ఈ నెల 13వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ కోట వీరబాబు ప్రకటించారు.

## మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన


ఇంటర్వ్యూ చేస్తున్న సిబ్బంది

**సుజాతనగర్:** డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్‌మేళాకు 1500 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 900 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారని, ప్రతిభ ఆధారంగా 400 మందిని ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. కళాశాల చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ల ద్వారా మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.సీతారాంప్రసాద్, సిబ్బంది రమేశ్, శ్రీకాంత్, సైదయ్య, బాబూరావు, లక్‌పతి, మునీర్, వెంకటేశ్వర్లు, కృష్ణమోహన్, రవికిరణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న సోయం సత్యనారాయణ

**పాల్వంచరూరల్:** ప్రపంచ ఆదివాసీ హక్కుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 12, 13వ తేదీల్లో భద్రాచలంలో నిర్వహిస్తున్న సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంక్షేమ, హక్కుల పరిరక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సోయం సత్యనారాయణ కోరారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి కొమరంభీం కమ్యూనిటీ హాల్లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారతదేశంలోని పది రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ నాయకుల సమ్మేళనం, సాంస్కృతిక, సంప్రదాయాలపై నిర్వహించనున్న కార్యక్రమానికి ఆదివాసీలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో అరేం ప్రశాంత్, కుర్సం రమేశ్, అశోక్‌చౌదరి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

కనీస వేతనాలు చెల్లించడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. వారి సమ్మెకు సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు, అంగన్‌వాడీటీచర్లు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాలు వెట్టిచాకిరీ చేయిస్తున్నాయే తప్ప కనీస వేతనాలు ఇచ్చే ప్రయత్నం చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా వేధింపులకు పాల్పడకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

–సాక్షి నెట్‌వర్క్


సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరంలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


సుజాతనగర్: సమ్మెలో కూర్చున్న అంగన్‌వాడీలు


జూలూరుపాడులో సమ్మె చేయెుద్దని సూచిస్తున్న సీడీపీఓ నిర్మలజ్యోతి


పాల్వంచరూరల్: తాళం వేసి ఉన్న కేంద్రం


జూలూరుపాడు: సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు


ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న నబీ, శంకర్


టేకులపల్లి: నినాదాలు చేస్తున్న దృశ్యం

### క్లుప్తంగా

### కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

**సుజాతనగర్:** గొల్లకురుముల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 16న చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య పిలుపునిచ్చారు. సుజాతనగర్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గొల్ల కురుమలకు ఎలాంటి షరతులు విధించకుండా నగదు బదిలీ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని వారికి గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని, 50 ఏళ్లు దాటిన కాపరులకు రూ.5,000 పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బచ్చలకూర శ్రీను, మల్లెపోయిన లింగయ్య, కాట్రాల తిరుపతిరావు, వీర్ల ముత్తయ్య, లిక్కి నాగరాజు, కొంపెల్లి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

### కాంట్రాక్ట్ కార్మికులను విస్మరిస్తున్నారు..

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోందని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.సతీశ్ ఆరోపించారు. ఇటీవల జరిగిన సదస్సులో రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన ఆయన సోమవారం కొత్తగూడెంలో మాట్లాడారు. సింగరేణిలోని పర్మనెంట్ కార్మికులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నా కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈ నెల 20 నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించనున్నామని ఆయన తెలిపారు.

### దన్‌బాద్‌లో వైద్యశిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్యుడు, సిబ్బంది

**కొత్తగూడెంటౌన్:** సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని దన్‌బాద్‌లో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానికులకు డాక్టర్ ఎం.పరుశురాములు, స్టాఫ్‌నర్స్ సీమా బృందం వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ పీఓ ఎం.శ్రావణ్‌కుమార్, సర్పంచ్ బి.రాందాస్‌తో పాటు ఎండీ రజాక్, సీహెచ్ నాగరాజు, సీహెచ్ సాగర్, ఉపేందర్ పాల్గొన్నారు.

### పలువురికి విషజ్వరాలు

**పాల్వంచరూరల్:** మండలంలోని పలు గ్రామాల ప్రజలు డెంగీ, తదితర విషజ్వరాల బారిన పడుతున్నారు. జగన్నాథపురం పీహెచ్‌సీ పరిధిలో సోమవారం 92 మందిని పరీక్షించగా 8 మందికి వైరల్ ఫీవర్ ఉన్నట్లు తేలిందని డాక్టర్ రాజు తెలిపారు. అలాగే, జగన్నాథపురానికి చెందిన ఓ వ్యక్తి ప్రైవేట్ ల్యాబ్‌లో పరీక్ష చేయించుకోగా డెంగీగా నిర్ధారించారు. దీంతో వైద్యులు ఆయన ఇంటికి వెళ్లి మళ్లీ పరీక్ష చేయగా డెంగీ లేదని, వైరల్ ఫీవర్ ఉన్నట్లు తేల్చారు.

### ఏఈపై కాంట్రాక్టర్ ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న కాంట్రాక్టర్ వెంకటేశ్వరరావు

**కొత్తగూడెంరూరల్:** లక్ష్మీదేవిపల్లి మండలంలోని మైలారం జెడ్పీహెచ్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేసి ఏడాది కావొస్తున్నా.. సంబంధిత ఏఈ రాజ్‌గోపాల్ బిల్లులు చేయడం లేదని కాంట్రాక్టర్ సకినాల వెంకటేశ్వరరావు జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత ఏఈ రాజ్‌గోపాల్‌తో మాట్లాడి వెంటనే బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు.

### నేడు ఆరోగ్య మహిళా కేంద్రం షురూ

**జూలూరుపాడు:** స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో మంగళవారం ఆరోగ్య మహిళా కేంద్రాన్ని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు డాక్టర్ రాకేశ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య మహిళా కేంద్రంలో ప్రతి మంగళవారం మహిళలకు ఆరోగ్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

### దశలవారీగా ఆందోళనలు

**ఇల్లెందు:** కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఇఫ్టూ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తామని ప్రగతిశీల కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు యాకుబ్‌షావలి, తోకల రమేశ్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఇల్లెందులో జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఆర్.మధుసూదన్‌రెడ్డి, వెంకట్, పి.సతీశ్, చంద్రశేఖర్, సీవై పుల్లయ్యతో పాటు 16 మందితో నూతన కమిటీని ఎంపిక చేశారు.